క్లుప్తంగా

లాభసాటిగా పాల ఉత్పత్తి

మండవల్లి: తక్కువ ఖర్చుతో లాభసాటిగా పాల ఉత్పత్తి చేసుకోవాలని ముదినేపల్లి పశువైద్యాధికారి యు.క్రాంతికుమార్ తెలిపారు. మండవల్లి ఏడీ కార్యాలయంలో సోమవారం ఆయన రైతులతో మాట్లాడారు. పాడి పశువులను శాస్త్రీయ పద్ధతిలో మేపితే పాల ఉత్పత్తికయ్యే ఖర్చు తగ్గించుకోవచ్చన్నారు. సాధారణంగా పచ్చిగడ్డి, ఎండు గడ్డి 3:1 నిష్పత్తిలో ఇవ్వాలన్నారు. పచ్చిగడ్డిలో ధాన్యపు, పప్పు జాతి గ్రాసాలను ఇవ్వాలని తెలిపారు. సాధారణంగా వరిగడ్డిని ఎండు గడ్డిగా వాడతారని, అధిక దిగుడుబడినిచ్చే పాడి పశువులకు దాణాను (వేరుశెనగ చెక్క, పత్తి చెక్క, పొద్దుతిరుగుడు చెక్క) కూడా ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు. తగిన మోతాదులో పచ్చిగడ్డి ఇవ్వడం వల్ల దాణా ఖర్చు తగ్గించుకోవచ్చని తెలిపారు. మండవల్లి పశువైద్యశాల ఏడీ వరప్రసాద్ మాట్లాడుతూ పశువులకు పచ్చిగడ్డి వేయడం ద్వారా పాలు పెరిగి ఖర్చు తగ్గుతుందన్నారు.

ముదినేపల్లి ఎస్ఐగా వీరభద్రరావు

ముదినేపల్లి రూరల్: ముదినేపల్లి ఎస్ఐగా వీఎస్ వీరభద్రరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల నుంచి ఆయన బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన డి.వెంకటకుమార్ కైకలూరుకు బదిలీ అయ్యారు.

శ్యామలాంబ గ్రామోత్సవం

కైకలూరు: చండీ మహాయాగ సహిత శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు శ్యామలాంబ దేవస్థానంలో అత్యంత వైభవంగా ఇటీవల ముగిశాయి. అమ్మవారి గ్రామోత్సవం సోమవారం కన్నుల పండువగా జరిగింది. ఆలయ ఈఓ వీఎస్కే.శేఖర్ ఆధ్వర్యంలో శక్తి వేశాలు, గరగ డప్పులు, మంగళవాయిద్యాలతో అమ్మవారు పురవీధుల్లో ఊరేగారు. ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు కనకదుర్గాప్రసాద్, బలరామకృష్ణ, శ్యామ్ప్రసాద్, రాంబాబు, రామ్మోహనరావు, వెంకటరావు, రఘు, రామస్వామి, శంకర్, బీజేపీ నాయకులు విష్ణురావు, వెంకట రామప్రసాద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాను సిద్ధం చేయండి

కైకలూరు: పంచాయతీ సెక్రటరీలు ఆయా గ్రామాల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాను సిద్ధం చేసుకోవాలని కైకలూరు ఎంపీడీఓ రెడ్డిబత్తుల ఫణీంద్ర పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశం సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్యాప్ సర్వేలో భాగంగా ఎస్సీ గ్రామాల్లో రోడ్డు, మంచినీటి వసతి, డ్రెయినేజీల నిర్మాణానికి అంచనాలను రూపొందించాలని ఆదేశించారు.

మినుము రైతులు విలవిల..!

పైరుపై మారుకా మచ్చల పురుగు దాడి

మినుము పైరును మచ్చల పురుగు మింగేస్తోంది. లంక భూముల్లో మినుము సాగు చేస్తున్న రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా మినుము పైరుపై మారుకా మచ్చల పురుగు దాడి చేస్తుండటంతో పైరును ఎలా కాపాడుకోవాలో అర్థంకాక అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

తోట్లవల్లూరు: కృష్ణానది వరదలతో లంకల్లో పంటలన్నీ వరద ముంపునకు గురై దెబ్బతిన్నాయి. ప్రత్యామ్నాయ పంటల సాగులో భాగంగా లంక రైతులు మినుము పైరు సాగును విస్తారంగా చేపట్టారు. మినుము సాగుతో వరద మిగిల్చిన నష్టం నుంచి కొంతైనా తేరుకోవచ్చనే ఆశతో రైతులు ఉన్నారు.

విస్తారంగా సాగు..

మండల పరిధిలోని రొయ్యూరు, వల్లూరుపాలెం, తోట్లవల్లూరు, భద్రిరాజుపాలెం, పాములలంక, చాగంటిపాడు, దేవరపల్లి, గురివిందపల్లి, ఐలూరు తదితర గ్రామాల పరిధిలోని లంక భూముల్లో రైతులు ఎక్కువగా మినుము సాగును చేపట్టారు. పీయూ 31, 645, టీ9, ఎల్బీజీ 642, 48 వంటి మినుము విత్తనాలను వినియోగించారు. పంట కాలం 90 రోజులుకాగా, ఇప్పటికి పంట సాగు ప్రారంభించి నెల రోజులు పూర్తయింది.

ఉధృతంగా దాడి

మినుము పైరుపై మారుకామచ్చల పురుగు ఉధృతంగా దాడి చేస్తోంది. మినుము ఆకును పీల్చిపిప్పి చేస్తుండటంతో రైతులు లబోదిబోమంటున్నారు. మొగ్గ, పూత, పిందె దశల్లో ఆకులను జల్లెడలా చేసి ఎక్కువగా నష్టం కలిగిస్తుండటంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పురుగు తీవ్రత ఎక్కువగా ఉండటంతో రెండు రోజులకోసారి పురుగు మందు పిచికారి చేయాల్సి వస్తోందని చెబుతున్నారు. కృష్ణానది వరదతో ఇప్పటికే తీవ్రంగా నష్టపోయామని, మినుము పైరుపై పురుగు ఉధృతితో దిగుబడులు తగ్గిపోయి మరింత నష్టానికి గురయ్యే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మినుమును దెబ్బతీస్తున్న మారుకామచ్చల పురుగు



పురుగు ఉధృతితో దెబ్బతిన్న మినుము పైరు

పురుగు ఎక్కువగా ఉంది

బీసీ సొసైటీలో ఎకరంన్నర పొలంలో మినుము పైరును సాగు చేశాను. పొలంలో మారుకామచ్చల పురుగు ఉధృతి ఎక్కువగా ఉంది. నెల రోజుల వ్యవధిలో ఐదు సార్లు పురుగు మందు పిచికారీ చేయాల్సి వచ్చింది.

– ఎం.బాలకృష్ణ, తోట్లవల్లూరు

పెట్టుబడి కూడా రాదు

కృష్ణానది వరద కారణంగా మినుము పైరులో పురుగు ఉధృతి ఎక్కువగా ఉంది. పురుగు మందులు ఎన్నిసార్లు పిచికారీ చేసినప్పటికీ సరైన ప్రయోజనం కనిపించటం లేదు. ఈ ఏడాది పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు.

– ఎం.రాంబాబు, తోట్లవల్లూరు

నివారణ ఇలా..

మారుకామచ్చల పురుగు నివారణకు రైతులు తగిన చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి జి.నాగేశ్వరరావు తెలిపారు. స్పైనోసాడ్ 0.3 ఎంఎల్ లీటరు నీటిలో లేదా ఎమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రాములు లీటరు నీటిలో లేక రైనాక్సిఫర్ 0.3 ఎంఎల్ లీటరు నీటిలో లేక ఫ్లూబెండమైడ్ 0.2 ఎంఎల్ లీటరు నీటిలో లేక సైక్లానిలిప్రోల్ 0.3 ఎంఎల్ లీటరు నీటిలో కలిపి చల్లటి వేళలో పైరు తడిచే విధంగా పిచికారీ చేయాలని సూచించారు.



మినుము పైరును పరిశీలిస్తున్న ఏఓ నాగేశ్వరరావు

■ ముదినేపల్లి రూరల్: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ సమావేశపు హాల్లో మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు.

అమర వీరులను స్మరించుకోవాలి



పామర్రులో పోలీసులను సన్మానించిన ఘంటసాల కళాపీఠం అధ్యక్షుడు మురళీకృష్ణ



కలిదిండి మండలం పెదలంకలో కర్రి మనోజ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పోలీసులు

పామర్రు: పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఘంటసాల కళాపీఠం ఆధ్వర్యంలో పామర్రు పోలీసులను సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కళా పీఠం అధ్యక్షుడు కాటూరి వెంకట మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రజా సేవే పరమావధిగా భావించి, మన శ్రేయస్సు కోసం రేయింబవళ్లు కష్టపడుతూ ప్రాణాలు వదిలిన పోలీసుల అమర వీరులను ఎల్లప్పుడూ స్మరించుకోవాలన్నారు. అనంతరం పోలీసులు చేసిన సేవలకు గుర్తుగా పామర్రు సీఐ సుభాకర్, ఎస్ఐ అవినాష్, మిగిలిన పోలీసు సిబ్బందిని ఘనంగా సన్మానించామన్నారు. కార్యక్రమంలో ఏపీ క్రైస్తవ సంక్షేమ సంఘ అధ్యక్షుడు సాల్మన్ కొల్లాబత్తుల తదితరులు పాల్గొన్నారు.

మండవల్లి: పోలీసు అమరవీరుల దినోత్సవం సోమవారం మండవల్లిలో ఘనంగా నిర్వహించారు. విధి నిర్వహణలో అసువులు బాసిన అమర వీరులకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎస్ఐ శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో మండవల్లిలో ర్యాలీ, మానవహారం నిర్వహించారు.

కలిదిండిలో..

కలిదిండి(కైకలూరు): ఖాకీ దుస్తులతో పోలీసు మరణిస్తే డిపార్టుమెంట్ ఉన్నంత వరకు గుర్తు ఉంటుందని రూరల్ సర్కిల్ సీఐ వి.రవికుమార్ పేర్కొన్నారు. పోలీసు అమరు వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా కలిదిండి మండలం మూలలంకలో 2008 జూన్ 29న బలిమేల ఘటనలో మావోయిస్టుల చేతిలో అశువులు బాసిన గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ కర్రి మనోజ్కుమార్ విగ్రహానికి సోమవారం నివాళులర్పించారు. సీఐ మాట్లాడుతూ కూంబింగ్ పూర్తి చేసుకుని బలిమెల రిజర్వాయర్ కొండల మధ్య నదిలో లాంచీపై వస్తున్న గ్రేహౌండ్స్, సాధారణ పోలీసులు, హోంగార్డుపై రాకెట్ లాంచర్తో దాడి చేశారన్నారు. ఈ ఘటనలో 38 మంది మరణించారని, వీరిలో కర్రి మనోజ్ ఒకరన్నారు. కార్యక్రమంలో కర్రి మనోజ్ తల్లిదండ్రులు సత్యనారాయణ, అప్పాయమ్మ, సర్పంచ్ మహాదేవ విజయబాబు, కలిదిండి, కైకలూరు రూరల్, మండవల్లి, ముదినేపల్లి ఎస్ఐలు పాల్గొన్నారు.

కైకలూరు టౌన్లో..

పోలీసు అమరవీరుల దినోత్సవం కైకలూరు పట్టణంలో టౌన్ సర్కిల్ సీఐ పి.కృష్ణ ఆధ్వర్యంలో జరిగింది. టౌన్ స్టేషన్ నుంచి విద్యార్థులతో కలసి ర్యాలీ చేశారు. టౌన్ ఎస్ఐ శ్రీను పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన

గుడివాడరూరల్: విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని విద్యార్థినులకు ఎస్ఐ ఎన్.చంటిబాబు సూచించారు. మండలంలోని మోటూరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులతో పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సును సోమవారం నిర్వహించారు. తొలుత పోలీస్ అమరవీరుల త్యాగాల గురించి వివరించారు.

యువతలో సాహిత్యాభిరుచిని పెంచుదాం



గుడివాడ టౌన్: యువత కంప్యూటర్ యుగాన్ని అనుసరిస్తుందే తప్ప సాహిత్యంపై శ్రద్ధ చూపడంలేదని వారిని ప్రోత్సహించాల్సిన బాధ్యత సాహితీవేత్తలదేనని పట్టణ సాహితీ మిత్ర సంస్థ కన్వీనర్ వసుధ బసవేశ్వరరావు అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సోమవారం ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెలా మూడో ఆదివారం సాయంత్రం సాహితీ స్రవంతి, సాహితీ మిత్రుల సంస్థ సయుక్త ఆధ్వర్యంలో సీఐటీయూ కార్యాలయంలో కళాశాలల యువతీ యువకులతో కలిసి సమ్మేళనాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు.

గుడివాడ అభివృద్ధిపై దృష్టి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాము

గుడివాడ టౌన్: గుడివాడ పట్టణ అభివృద్ధిపై దృష్టి సారించి అధికారులు, ప్రజాప్రతినిధులు కృషిచేయాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నూతనంగా బదిలీపై వచ్చిన శానిటేషన్, వాటర్వర్క్స్, రెవెన్యూ, పబ్లిక్ హెల్త్, ఇతర శాఖల అధికారులతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో ప్రజల భాగస్వామ్యంతో మురుగునీటి సమస్య పరిష్కారానికి కృషిచేద్దామన్నారు. మున్సిపల్ కమిషనర్ బి. శ్రీనివాసరావు, అసిస్టెంట్ కమిషనర్ పి.శ్రీనివాసరావు, పబ్లిక్ హెల్త్ డీఈ పాండురంగారావు, ఇతర అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

తాగునీరు, రోడ్ల సమస్య పరిష్కారానికి ప్రాధాన్యం

గుడివాడరూరల్: తాగునీరు, రోడ్ల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇచ్చి పరిష్కరిస్తానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. స్థానిక రాజేంద్రనగర్లోని ఎమ్మెల్యే స్వగృహానికి పలు సమస్యలను వివరించేందుకు వచ్చిన ప్రజల నుంచి ఎమ్మెల్యే సోమవారం అర్జీలు స్వీకరించారు. గుడ్లవల్లేరు మండలం చింతలగుంటలో రోడ్ల సమస్యను, గుడివాడ మండలం లింగవరం పరిధిలో నివాసాలు లేని చోట అధికారులు రోడ్లు వేసేందుకు చర్యలు తీసుకుంటున్నారని ఎమ్మెల్యేకు వివరించారు. వెంటనే ఆయా శాఖల అధికారులతో మాట్లాడి ప్రాధాన్యత గల చోట్ల రోడ్లు వేయాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు.


ఉచిత కంటి వైద్యశిబిరం

పమిడిముక్కల: మండల విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో వీరంకిలాకులో సోమవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె.రాజేంద్రప్రసాద్, సీహెచ్ ఆశీర్వాదం, జిల్లా ఉపాధ్యక్షులు యడ్ల దుర్గారావు ప్రారంభించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కైకలూరు: కొల్లేరు గ్రామాల్లో సిమెంటు రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఉపాధి హామీ పథకం నిధులు కేటాయించడం హర్షణీయమని వడ్డి సాధికారత కమిటీ రాష్ట్ర కన్వీనర్ బలే ఏసురాజు పేర్కొన్నారు. గుమ్మళ్లపాడు, కొట్టాడ, పందిరిపల్లిగూడెం పంచాయతీల్లో ఆరు సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.59.49 లక్షల నిధులతో శంకుస్థాపనలను కూటమి నేత త్రినాథరాజుతో కలసి సోమవారం చేశారు. సర్పంచ్లు గంగయ్య, వెంకటరమణ, పద్మావతి పాల్గొన్నారు.


గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



బొడ్డపాడులో సిమెంటు రోడ్డు పనుల ప్రారంభంలో పాల్గొన్న ఎమ్మెల్యే కుమార్రాజా

తోట్లవల్లూరు: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్రాజా అన్నారు. మండలంలోని బొడ్డపాడులో రూ.40 లక్షలతో నిర్మించనున్న సిమెంటు రోడ్లు, శ్మశానవాటిక అభివృద్ధి పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సిమెంటు రోడ్ల నిర్మాణం ద్వారా ప్రజలకు ఇబ్బందులు తొలగనున్నాయన్నారు. సర్పంచ్ మూడే శివశంకర్రావు, అధికారులు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఖో-ఖో పోటీలకు విద్యార్థుల ఎంపిక



జమీగొల్వేపల్లి(పామర్రు): రాష్ట్ర స్థాయి ఖో-ఖో పోటీలకు తమ హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు హైస్కూల్ హెచ్ఎం టీ ఉషారాణి తెలిపారు. మండలంలోని జమీగొల్వేపల్లిలోని జెడ్పీ హైస్కూల్లో విజేతలను సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ గుడివాడలో ఈ నెల 20వ తేదీన ఎస్పీఎస్ మున్సిపల్ హైస్కూల్లో జరిగిన పోటీల్లో తమ హైస్కూల్ విద్యార్థులు రాణించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని అన్నారు. బాలికల విభాగంలో కె ధనలక్ష్మి, సీహెచ్ శరణ్య, కె రేష్మశ్రీ, బాలుర విభాగంలో కె.శ్రీనివాసరావు ఎంపికయ్యారని తెలిపారు. వీరు ఈ నెల 25,26,27 తేదీల్లో కాణిపాకంలో జరుగు 43వ జూనియర్ స్థాయి చాంపియన్ షిప్ ఖో-ఖో పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఖో-ఖో సంఘ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు మేకల సీతారామిరెడ్డి, టీఎస్ఆర్కె ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు మదకా ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రకటన

[illegible]

ప్రకటన

[illegible]

రోడ్లకు మరమ్మతులు చేయండి సారూ..

మండవల్లి: మండలంలో అధ్వానంగా మారిన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కోరుతూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం)లో సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు, టి.అప్పారావు, కె.సూర్యారావు, బి.వెంకయ్య తదితరులు తహసీల్దారు కె.గోపాల్కు ఈ సందర్భంగా సమస్య వివరించారు.

హుండీ ఆదాయం రూ.9 లక్షలు

కైకలూరు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానంలో భక్తులు సమర్పించిన హుండీ కానుకలను గుడివాడ దేవదాయశాఖ తనిఖీ అధికారి సమక్షంలో సోమవారం లెక్కించారు. ఆలయ ఈఓ కూచిపూడి శ్రీనివాసు మాట్లాడుతూ భక్తులు 121 రోజులకు హుండీలలో వేసిన నగదు, కానుకలు లెక్కించగా రూ.9,07,104 ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు

గుడివాడరూరల్: మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని గుడివాడ టూటౌన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ పి.నాగరాజు హెచ్చరించారు. పట్టణంలోని ఏజీకే మున్సిపల్ హైస్కూల్ వద్ద సోమవారం సాయంత్రం వాహనాల తనిఖీలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులు, వాహనదారులపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.